వాయిస్ ఆఫ్ వందే భారత్
Voice of Vande Bharath
VOICE OF VANDE BHARATH
బుధవారం, సెప్టెంబర్ 09, 2026

## ఇది శాసనసభ కాదు.. దుశ్శాసన సభ

- గవర్నర్‌కు బీఆర్ఎస్ ఫిర్యాదు
- ప్రభుత్వ తీరుపై కేటీఆర్ తీవ్ర ఆరోపణలు
- కేసీఆర్ నివాసంపై దాడి యత్నం జరిగిందని ఆరోపణ
- ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలపై పోలీసుల దాడి: కేటీఆర్
- మహిళా ఎమ్మెల్యేల పట్ల అనుచిత ప్రవర్తనపై ఫిర్యాదు



**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** తెలంగాణలో రాజకీయ ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో బీఆర్ఎస్ నేతలు గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను ఆశ్రయించారు. కేటీఆర్ నేతృత్వంలో డిప్యూటీ ఫ్లోర్ లీడర్లు హరీష్ రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్, సబితా ఇంద్రారెడ్డి, శాసన మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనా చారి తదితరులు లోక్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసి రాష్ట్ర ప్రభుత్వ తీరుపై ఫిర్యాదు చేశారు. మాజీ సీఎం కేసీఆర్ నివాసంపై దాడికి యత్నం జరిగిందని, తమ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలపై పోలీసులు దౌర్జన్యానికి పాల్పడ్డారని ఆరోపించారు. శాసనసభ సమావేశాల తొలిరోజు టీ–షర్టులతో నిరసనకు వెళ్లిన తమను సభలోకి రాకుండా రోడ్డుపైనే అడ్డుకున్నారని కేటీఆర్ తెలిపారు. మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు అనుచితంగా వ్యవహరించారని, సునీతా లక్ష్మారెడ్డి చీరను లాగారని ఆరోపిస్తూ ఇందుకు సంబంధించిన ఫోటోలు, ఆధారాలను గవర్నర్‌కు అందజేశారు. దాడికి పాల్పడిన పోలీసులపై చర్యలు తీసుకోవాల్సింది పోయి తిరిగి తమపైనే అక్రమ కేసులు బనాయించారని మండిపడ్డారు. స్పీకర్‌పై తమకు అపారమైన గౌరవం ఉందని, అయితే కాంగ్రెస్ పార్టీనే 'దళిత స్పీకర్' అంటూ రాజకీయ లబ్ది పొందేందుకు ప్రయత్నిస్తోందని కేటీఆర్ ఆరోపించారు. ఈ పరిణామాలన్నింటి నేపథ్యంలోనే ప్రస్తుత సభను 'కౌరవ సభ', 'దుశ్శాసన సభ'గా అభివర్ణిస్తున్నట్లు చెప్పారు. తాము లేవనెత్తిన అన్ని అంశాలపై విచారణ జరిపిస్తామని గవర్నర్ హామీ ఇచ్చినట్లు కేటీఆర్ వెల్లడించారు. రాష్ట్రంలో న్యాయం జరగకపోతే జాతీయ మహిళా కమిషన్‌ను ఆశ్రయిస్తామని హెచ్చరించారు.

## పదవులు రాలేదని నిరాశ చెందొద్దు

- ప్రతి కార్యకర్తను గుర్తిస్తా..
- పార్టీ బలోపేతమే లక్ష్యం: జగ్గారెడ్డి
- సంగారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ కమిటీల నియామక సమావేశంలో హామీ
- 4 మండలాలు, 2 మున్సిపాలిటీలపై ప్రత్యేక దృష్టి
- సెప్టెంబర్ 30 నుంచి నాలుగు రోజుల పాటు వరుస సమీక్షలు






**సంగారెడ్డి, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** పార్టీలో పదవులు దక్కని కార్యకర్తలు ఎలాంటి నిరాశకు గురికావద్దని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. పదవులు వచ్చినా.. రాకపోయినా ప్రతి కార్యకర్తను గుర్తించి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని స్పష్టం చేశారు. త్వరలోనే మండలాల వారీగా సమావేశాలు నిర్వహించి ప్రతి కార్యకర్తతో వన్‌టువన్‌గా మాట్లాడతానని ప్రకటించారు. సంగారెడ్డి పట్టణంలోని క్లాసిక్ గార్డెన్స్‌లో బుధవారం సంగారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కమిటీల నియామక సమావేశం నిర్వహించారు. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, డీసీసీ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాల కాంగ్రెస్ కమిటీలను ప్రకటించారు.దీంతో పాటు ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, మహిళా, ఐఎన్‌టీయూసీ, కాంగ్రెస్ కిసాన్ సెల్ తదితర ఫ్రంటల్ ఆర్గనైజేషన్ల కమిటీలను సైతం ప్రకటించారు.

### 'పదవులు ఉన్నా.. లేకున్నా గుర్తిస్తా'

ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ పార్టీ పదవులు దక్కిన వారు, దక్కని వారు అనే తేడా లేకుండా ప్రతి కార్యకర్తను గుర్తిస్తానని తెలిపారు. పదవులు రాలేదని ఎవరూ నిరాశ చెందవద్దని, పార్టీ కోసం పనిచేసే ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు ఉంటుందని అన్నారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు విభేదాలను పక్కనపెట్టి సమన్వయంతో పనిచేయాలని, నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

### అధికారులతో సమీక్ష సమావేశాలు

సంగారెడ్డి నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంపై త్వరలో వరుస సమీక్ష సమావేశాలు నిర్వహించనున్నట్లు జగ్గారెడ్డి వెల్లడించారు. నాలుగు మండలాలకు చెందిన గెలిచిన, ఓడిన కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నాయకులతో అధికారుల సమక్షంలో ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తామని చెప్పారు.



రెండు మున్సిపాలిటీలకు సంబంధించిన ప్రజాప్రతినిధులు, అధికారులతోనూ ప్రత్యేకంగా సమీక్ష నిర్వహిస్తామని తెలిపారు. సెప్టెంబర్ 30 నుంచి నాలుగు రోజుల పాటు వరుసగా సమావేశాలు నిర్వహించి, ప్రతి నాయకుడు, కార్యకర్తతో వన్‌టువన్‌గా మాట్లాడతానని జగ్గారెడ్డి తెలిపారు. నియోజకవర్గంలోని క్షేత్రస్థాయి సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అన్నారు.

### అన్ని శాఖల అధికారులకు ఆహ్వానం

సమీక్ష సమావేశాలకు పోలీసు శాఖతో పాటు అన్ని ప్రభుత్వ శాఖల అధికారులను కూడా ఆహ్వానించి ప్రజా సమస్యలు, అభివృద్ధి అంశాలపై చర్చిస్తామని జగ్గారెడ్డి తెలిపారు. ప్రజలకు మరింత చేరువగా ఉంటూ వారి సమస్యలను పరిష్కరించేందుకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

## బస్తీ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

- వైద్యాధికారులు, సిబ్బంది సమయపాలన పాటించాలి
- ఎన్‌సీడీ సర్వే, స్క్రీనింగ్, ఫాలోఅప్‌ను ప్రతీరోజూ నిర్వహించాలి
- దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాలి



**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** బస్తీ ప్రాంతాల్లో నివసించే ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంతో పాటు ప్రభుత్వ ఆరోగ్య పథకాల ప్రయోజనాలను ప్రతి అర్హుడికి చేరేలా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి డా. పుట్ల శ్రీనివాస్ ఆదేశించారు. బుధవారం ఆయన బోరబండ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలోని హాజరు రిజిస్టర్, రోగులకు అందుతున్న వైద్య సేవలు, ఔషధాల లభ్యత, ల్యాబొరేటరీ కేంద్రం, వివిధ రికార్డులు, పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలను పరిశీలించారు.

- **ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలను పూర్తి చేయాలి**

అనంతరం వైద్యాధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆరోగ్య కార్యక్రమాలకు నిర్దేశించిన లక్ష్యాలను సత్వరమే పూర్తి చేయాలని, వైద్య సిబ్బంది విధులకు సమయపాలనతో హాజరై ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ప్రత్యేకంగా అంటువ్యాధులు కాని వ్యాధుల (ఎన్ సీడీ) సర్వే, స్క్రీనింగ్, ఫాలోఅప్ కార్యక్రమాలను ప్రతీరోజూ సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగులకు అవసరమైన అన్ని రకాల మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గర్భిణీలకు అవసరమైన వైద్య సంరక్షణ,



శిశువులకు టీకాలు, అంటువ్యాధుల నివారణ, సీజనల్ వ్యాధుల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని డీఎంహెచ్ఓ సూచించారు. మలేరియా, డెంగ్యూ, చికున్‌గునియా వంటి వ్యాధుల నివారణకు ఇంటింటి ఆరోగ్య సర్వేలను సమర్థవంతంగా నిర్వహించాలని, వ్యాధుల నియంత్రణకు అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజలకు వ్యాధుల నివారణ, వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతపై విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. ప్రజలకు ప్రభుత్వ వైద్య సేవలు సులభంగా, నాణ్యంగా అందేలా చర్యలు తీసుకోవాలని డా.పుట్ల శ్రీనివాస్ తెలిపారు. ప్రభుత్వ ఆరోగ్య పథకాల ప్రయోజనాలు ప్రతి అర్హుడికి చేరేలా క్షేత్రస్థాయిలో సిబ్బంది చొరవ చూపాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## నాలుగో బెటాలియన్‌లో ఘనంగా కాళోజీ జయంతి



**వరంగల్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** మామునూరు నాలుగో బెటాలియన్ ఆవరణలో ప్రజాకవి పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ ఈ. వీరన్న ముఖ్య అతిథిగా పాల్గొని కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిజాం నిరంకుశత్వానికి, అరాచక పాలనకు వ్యతిరేకంగా తన కలంతో పోరాడిన గొప్ప స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ ఉద్యమకారుడు కాళోజీ అని కొనియాడారు. ఆయన సేవలను గౌరవిస్తూ తెలంగాణ ప్రభుత్వం ఆయన జన్మదినాన్ని 'తెలంగాణ భాషా దినోత్సవం'గా నిర్వహిస్తోందని తెలిపారు. తెలుగు, ఉర్దూ, హిందీ, మరాఠీ, కన్నడ, ఇంగ్లీష్ భాషల్లో రాణించిన కాళోజీ.. రాజకీయ వ్యంగ్య కవిత్వం రాయడంలో దిట్ట అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ జె. రాజేందర్, రిజర్వ్ సబ్ ఇన్స్పెక్టర్లు శ్రీకాంత్, రాకేష్ గౌడ్, సురేందర్, సంపత్, వేణు, గోపి, రాజశేఖర్, శ్రీనివాస్, ప్రవీణ్, రాజేష్‌తో పాటు బెటాలియన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.